క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణపై అవగాహన అభినందనీయం



మాట్లాడుతున్న సీఐ జి.గోపీనాథ్

భైంసాటౌన్: విద్యార్థులకు ప్రజాస్వామ్యం విలువ తెలిసేలా మాక్ పోలింగ్ నిర్వహించడం అభినందనీయమని పట్టణ సీఐ జి.గోపీనాథ్ అన్నారు. పట్టణంలోని వేదం తపోవన్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటర్లుగా మారి క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యార్థులే పోలింగ్ అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు మాక్ పోలింగ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పిండి మర దగ్ధం

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో పిండి మర దగ్ధమైంది. ఇటీవల బ్యాంకులో రుణం తీసుకుని ఆడెపు సంపూర్ణ – ప్రసాద్ దంపతులు దీన్ని ఏర్పాటు చేసుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా, దీని విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు ప్రసాద్ తెలిపాడు. ఆర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి సుమన్, ఏఎల్ఐ సతీశ్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో గురుపౌర్ణమి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 8, 9, 10 తేదీల్లో జరిగే ఉత్సవాలకు జిల్లాకేంద్రంలోని గండిరామన్న సాయిబాబా ఆలయం ముస్తాబైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయచైర్మన్ గంగోని బురాజ్ తెలిపారు. తొలిరోజు ఉదయం 8 గంటలకు అఖండ సాయినామ కీర్తన పూజ కార్యక్రమం ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలకు మందిర ఆవరణలో పల్లకి ఊరేగింపు, 9న సాయిబాబాకు మంగళస్నానం, అర్చన పూజ, 10న మంగళస్నానం, పాలాభిషేకం, అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొత్తం 48 గంటల కొనసాగిన సాయినామం ఉదయం 11:30 నిమిషాలకు ముగిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి నిర్వహించి, మహా అన్నదానం నిర్వహిస్తారు.

అక్రమ షెడ్డు తొలగించాలి

ముధోల్: మండల కేంద్రంలోని రజక సంఘం శ్మశానవాటికకు ఆనుకుని ఉన్న అక్రమ షెడ్లను తొలగించాలని సంఘం సభ్యులు పంచాయతీ ఈవో అన్వర్ ఆటీకి సోమవారం వినతిపత్రం అందించారు. సర్వే నంబర్ 6లో శ్మశాన వాటిక ఉందని కొందరు వ్యక్తులు అక్రమంగా షెడ్డు వేసి కబ్జా చేశారన్నారు. దీంతో అంత్యక్రియలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. అక్రమ షెడ్డులను తొలగించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు బాలాజీ, పోతన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు'

లక్ష్మణచాంద: కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల పార్టీ నాయకులు తమపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బోరిగాంలో పల్లెవనాన్ని కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేశారని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అనడం సరికాదన్నారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లేశ్వర్, సురేష్, అశోక్, ప్రేమ్‌దాస్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఖానాపూర్: ఎర్వచింతల్‌లో సోమవారం ఎస్‌బీఐ సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై టీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో జనసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఎఫ్ఎల్ కౌన్సిలర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి హనుమంతు, కారోబార్ రాజు, గ్రామస్తులు ఉన్నారు.

రైతు గుర్తింపుకార్డు తప్పనిసరి

పెంబి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సద్వినియోగం చేసుకునేందుకు రైతు గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక రైతు వేదికలో సోమవారం వారితో సమావేశం నిర్వహించారు. కేంద్రం 11అంకెలతో కూడిన రైతు గుర్తింపు కార్డు ప్రక్రియను ప్రారంభించిందన్నారు. దరఖాస్తు చేసుకోనివారు ఆధార్ కార్డుతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

లక్ష్మణచాంద/సారంగపూర్/కడెం/భైంసారూరల్/ఖానాపూర్: జిల్లాలో మొహర్రం వేడుకలను ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పలుచోట్ల పీరీలను పురవీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. అనంతరం పీర్లకు భక్తులు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ అస్సైదులా ఆట ఆడారు. భక్తులు అగ్నిగుండం దాటారు. లక్ష్మణచాంద మండలం మునిపెల్లిలో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు ముగిశాయి. సారంగపూర్ మండలంలోని గ్రామాల్లో జోరువానలోనూ పీరీల సవారీని కొనసాగించారు. జామ్, తాండ్ర(జి), బీరవెల్లి, తదితర గ్రామాల్లో సందడి నెలకొంది. తాండ్ర(జి) గ్రామంలో చెలిమ నుంచి అగ్నిగుండం వరకు భారీ శోభాయాత్ర చేపట్టారు. దారి పొడవునా నృత్యాలు చేస్తూ పీరీలను ఆలయానికి చేర్చారు. అనంతరం అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కడెం మండలం కొండుకూర్, పాండ్వపూర్, బెల్లాల్, భైంసా మండలం పేండ్‌పెల్లి, కుంటాల మండలం కల్లూరు గ్రామాలతోపాటు దిలావర్‌పూర్, ఖానాపూర్‌లో పీరీలతో డప్పుచప్పుళ్ల మధ్య గోదావరి వరకు ఊరేగింపు చేపట్టారు.



ఖానాపూర్: పీరీలతో ఊరేగింపులో భక్తులు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో పాల్గొన్న ప్రజలు



దిలావర్‌పూర్‌లో పీరీల ఊరేగింపు



కడెం మండలం కొండుకూర్‌లో..

ప్రజాభవన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తా

- ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: అర్లి సుద్దవాగుపై వంతెన నిర్మాణం, బాసర ఆలయ అభివృద్ధికి రెండు నెలల్లో నిధులు మంజూరు కాకుంటే హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి యూరియా కొరత లేకుండా చూస్తామన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

హ్యాం నిధుల ద్వారా సేవాలాల్‌తండా నుంచి హవర్గ, మన్మద్, రాజూర గ్రామాలకు గాను రోడ్ల పనులు చేపడుతామన్నారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, తహసీల్దార్ సర్ఫరాజ్ అమ్మద్, ఎంపీడీవో వెంకటరమేశ్, డీటీ రవీందర్, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఎస్ఎం మినికిట్స్ కంది విత్తనాలు పంపిణీ

ముధోల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రామారావుపాటిల్ సోమవారం కుభీర్, బాసర, లోకేశ్వరం, తానూర్ మండలాల రైతులకు ఎన్ఎఫ్ఎస్ఎం మినికిట్స్ కంది విత్తనాలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, డివిజన్ ఆత్మచైర్మన్ నర్సారెడ్డి, ఆత్మడైరెక్టర్ కిషన్‌పతంగే, పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, ఏవోలు రచన, సారిక, మనీషా, గిరిరాజ్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న ఉన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



దిలావర్‌పూర్: మొక్క నాటుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



తానూరు: మొక్కలు నాటుతున్న ఎంఈవో నరేందర్ ,ఉపాధ్యాయులు

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్/మామడ/కుంటాల/తానూరు/నర్సాపూర్(జి)/దస్తురాబాద్: పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో అరుణ రాణి, నాయకులు డి.ముత్యంరెడ్డి, నర్సారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ వీరేశ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

☞ మామడ, కుంటాల, దస్తురాబాద్ పీహెచ్‌సీలు, మామడ మండలంలోని ప్రాథమిక, ఉన్నత, తానూరు మండలం ఎల్వి జెడ్పీ పాఠశాలలు, నర్సాపూర్(జి) సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో అధికారులు, వైద్యులు, ఎంఈవో, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

లక్ష్మణచాంద: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు సోమవారం ఆయన ప్రొసిడింగ్స్ అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ సమ్మట రవి, నాయకులు నాగేశ్, వినేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రమేశ్ పేర్కొన్నారు. పేర్కపల్లె, మున్యాల తండా, ఎర్రగుంటలో ఇందిరమ్మ ఇళ్ల పనులను సోమవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ ఉన్నారు.



ప్రొసిడింగ్ అందజేస్తున్న శ్రీనివాస్

ఈద్గా నిర్మాణంలో అవకతవకలపై ఫిర్యాదు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) సమీపంలో నిర్మించిన ఈద్గా నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగాయని సమగ్ర విచారణ జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో ఈద్గా నిర్మాణంలో సుమారు రూ.5.35 కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. ఏ శాఖ నుంచి ఎంత మొత్తం నిధులు కేటాయించారని తదితర వివరాలు కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ వివరాలన్నింటిని బయటపెట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అబ్దుల్ సాదిక్, సోఫీఇమ్రాన్, వినోద్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

తానూరు: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు దిగంబర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విడుదల చేయలేదన్నారు. దీంతో పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు విజయ్, చరణ్, సాయి, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

జీవో 282 రద్దుచేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 282 వెంటనే రద్దు చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం జీవో పత్రాలను దగ్ధం చేశారు. ఈ జీవో కార్మికులకు వ్యతిరేకంగా ఉందన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, జిల్లా నాయకులు గంగామణి, లక్ష్మి, విజయ, కమల, లలిత, చిట్టి పాల్గొన్నారు.

ఉన్నత చదువులపై దృష్టి సారించాలి

దస్తురాబాద్: విద్యార్థులు ఉన్నత చదువుల పై దృష్టి సారించాలని తహసీల్దార్ విశ్వంబర్ పేర్కొన్నారు. స్థానిక కేజీబీవీ విద్యార్థులతో సోమవారం మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అంతకుముందు వంటగది, స్టోర్ రూం, ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్వో తిరుమల, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

లోకేశ్వరం: విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు శైలాజ అన్నారు. పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు జ్వర పరీక్షలు చేశారు. హెచ్ఎం అశోక్, ఆరోగ్య కార్యకర్తలు వంశీ, రాణి ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మామడ: మండలంలోని కమల్‌కోట్ రాజరాజేశ్వరాలయంలో సోమవారం గ్రామస్తులు ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని ఎస్సై అశోక్ తెలిపారు.

కేజీబీవీ సందర్శన

సోన్: సోన్ కేజీబీవీని ఎంపీడీవో సురేశ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ గురించి విద్యార్థినుల అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన రుచి భోజనాన్ని అందించాలన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని శివారులో స్వయంభువుగా వెలిసిన శ్రీచక్ర శివలింగేశ్వర స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నిమ్మల శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఉత్కం ప్రసాద్ గౌడ్, కోశాధికారిగా ఆయి టి పెద్ద సాయన్న, రైటర్ గా సంగెం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు వారిని సన్మానించారు.

కంప్యూటర్ విరాళం

ముధోల్: మండలంలోని బ్రహ్మణ్‌గావ్ పాఠశాలకు సోమవారం గ్రామానికి చెందిన రాజుల రాధిక రఘునాథ్ రూ.25 వేల విలువ గల కంప్యూటర్‌ను విరాళం అందించారు. హెచ్ఎం బి.భాస్కర్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీతోపాటు ఉపాధ్యాయులు దాతను సన్మానించారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మారుతి, తదితరులు ఉన్నారు.

తగ్గిన పత్తి సాగు

- పెట్టుబడి ఖర్చులు, మందులు, కూలీల కొరత
- దిగుబడి అంతంతే
- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి
- పెరిగిన మొక్కజొన్న, పసుపు



కుభీర్‌లో సాగైన మొక్కజొన్న

కుభీర్: ఖరీఫ్ సీజన్‌లో గతేడాది సాగు చేసిన పత్తి కన్నా ఈసారి తగ్గింది. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, మందులు, కూలీల కొరత, తెగుళ్ల బెడద కారణంగా దిగుబడి అంతంత మాత్రంగా వచ్చింది. పైగా రెండేళ్లుగా ఆశించిన ధర రాకపోవడంతో దీని సాగు చేసేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, సోయా పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. వీటి సాగుఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ ఉండడంతో మొగ్గుచూపారు. ఎకరా సోయా సాగు చేస్తే 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావడం, పంట విక్రయించడానికి మార్కెట్ సౌకర్యం ఉంది. ఈ పంటకాలం 100 రోజులు, ఆ తర్వాత మొక్కజొన్న, జొన్న పంటలు వేసుకోవచ్చు. మొక్కజొన్న దిగుబడి అధికంగా వస్తుంది. అదేవిధంగా నిజామాబాద్‌లో కేంద్రప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటుతో దీని సాగు పెరిగింది. గత మార్చి, ఏప్రిల్‌లో క్వింటాల్ ధర రూ.18 వేలు ఉండగా ప్రస్తుతం క్వింటాల్ రూ.13 వేలు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మండలానికి ఆనుకుని ఉన్న మహారాష్ట్రలోని గ్రామాల రైతులు ఈ పంట వేశారు. కొందరు పసుపు సాగు చేయగా అంతర పంటగా మొక్కజొన్న, మిర్చి వేస్తున్నారు.

మండలంలో..

మండలంలో మొత్తం 50 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది పత్తి 35 వేల ఎకరాలు సాగు కాగా, ఈసారి 27 ఎకరాలు, ఈసారి మొక్కజొన్న సుమారు 5వేల ఎకరాలు వేశారు. గతేడాది సోయా 12 వేల ఎకరాలు సాగు చేయగా, ఈసారి 15 వేలకు పెరిగింది. 500 ఎకరాల్లో పసుపు పంట వేయగా, మిగిలిన 3 వేల ఎకరాల్లో మిర్చి, అరటి, చెరుకు తదితర ఇతర పంటలు సాగు చేశారు.

8 ఎకరాల్లో మొక్కజొన్న



8 ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. ప్రతిఏటా యాసంగి సీజన్‌లో సాగు చేస్తాను. ఈసారి ఖరీఫ్‌లో వేశాను. తక్కువ ఖర్చు, దిగుబడి ఎక్కువ ఉండడంతో పంట సాగు చేశాను.

– బషీర్, మొక్కజొన్న రైతు, కుభీర్

కొలారి నుంచి విత్తనం తెచ్చా



ఈసారి కొత్తగా ఎకరంన్నర వ్యవసాయ భూమిలో పసుపు వేశాను. మహారాష్ట్రలోని కొలారి నుంచి విత్తనం తెచ్చాను. నీటి సౌకర్యం ఉంది.

– బంక కపిల్, పసుపు రైతు, దార్‌కుభీర్

మాదిగల సంక్షేమానికి కృషి



భైంసారూరల్: జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



సోన్: వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్/నర్సాపూర్(జి)/ముధోల్/కుంటాల/ఖానాపూర్/లోకేశ్వరం/సోన్: మాదిగల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. భైంసా మండలంలోని బిజ్జూర్ గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ సుదీర్ఘ పోరాటం ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. వర్గీకరణకు, పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసిన వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని అని గుర్తు చేశారు. మండల బీజేపీ అధ్యక్షురాలు సుష్మారెడ్డి, నాయకులు ఏనుగు గంగారెడ్డి, అబ్దుల్ రజాక్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సట్ల సాయినాథ్, మహేందర్, సోనారి యోగేశ్ పాల్గొన్నారు.

మండలాల్లో జెండాలు ఎగురవేత

నర్సాపూర్(జి), ముధోల్, కుంటాల, ఖానాపూర్, లోకేశ్వరం, సోన్ మండలవ్యాప్తంగా జెండాలు ఎగురవేశారు. అనంతర కేక్‌కట్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగభూషణ్, జాతీయ నాయకుడు నందకుమార్, ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి మురళీకృష్ణ, మా జన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబేకర్ సాయిచంద్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ ఎంపీపీ గజ్జారాం, నాయకులు కత్తిబాబు, శనిగారపు రవి, సాగర్, పోశెట్టి, కొలగని రాజు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

భైంసారూరల్: ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత కోరారు. మండలంలోని దేగాంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కేంద్రం తీరుకు నిరసనగా నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని కోరారు. బీడీ కార్మికులు వనిత, గిరి, గంగామణి, గీత, రేణుక,సురేఖ, లక్ష్మీబాయి, సోని పాల్గొన్నారు.

కడెం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, నూతన్‌కుమార్ తెలిపారు. సోమవారం కడెంలో వారు మాట్లాడుతూ కేంద్రం కార్మికుల హక్కులను విస్మరిస్తుందని, ఉపాధి కూలీల వేతనాలు పెంచలేదన్నారు.



మాట్లాడుతున్న ఎం.హరిత

ఖానాపూర్: కార్మికులు అనేక పోరాటాల కారణంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చొద్దని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జావిద్, త్రివేణి, సురేష్, గంగాధర్, అరుణ్, రమేష్, రజిత, మునీంద్ర, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠినచర్యలు

లక్ష్మణచాంద: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరిగాం అనుబంధ గ్రామం బోరిగాంతండా పల్లెవనంలోని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి ఆక్రమించేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన సోమవారం బోరిగాం తండా పల్లె వనాన్ని సందర్శించి గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా ఎందుకు మళ్లీ మొక్కలు నాటారని ఎంపీడీవో రాధను ప్రశ్నించారు. బాధ్యులు ఉపయోగించిన వాహనాలు ఎందుకు సీజ్ చేయలేదని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనాకు ఫోన్‌లో అడిగారు. ఎమ్మెల్యేగా తను పర్యటిస్తే ప్రోటోకాల్ ప్రకారం ఎస్సై రాలేదన్నారు. మండల అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు రమేశ్, రాజేశ్వర్, సురేష్, జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నర్సాపూర్(జి): స్థానిక రైతు వేదికలో ఆయా గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, నాయకులు పాల్గొన్నారు.